
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

ఆదివారం 7 జూలై 2024

ట్రాక్టర్లు ఆపితే తొక్కిస్తాం..
- రెచ్చిపోతున్న ఇసుక మాఫియా
- ముస్తాబాద్ సంఘటన పునరావృతం అవుతుందేమోనని భయం
- విధులు నిర్వహించాలంటే ఆందోళన చెందుతున్న రెవెన్యూ సిబ్బంది

7లో

అమ్మకు ఆషాఢ బోనం

- నేటి నుంచి ఆషాఢమాసం ప్రారంభం
- నెలరోజుల పాటు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు
- సిగాలూగనున్న పల్లె, పట్టణాలు





చిన్నకోడూరు, జూలై 6 : ఆషాఢ మాసం వచ్చేసింది.. పల్లెలు, పట్టణాల్లో బోనాల సందడి మొదలుకానున్నది. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో హోరెత్తనుంది. ఊరూరా ఆధ్యాత్మికత వెల్లివిరయనుంది. ఆదివారం ఆషాఢమాసం ప్రారంభం కానుండగా, నెలరోజుల పాటు గ్రామ దేవతల ఆలయాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి.

జగజ్జనని.. చల్లగా కాపాడమని

సర్వజగజ్జనని అనేక రూపాలు, పేర్లతో.. దర్శనమిస్తుంది. మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, పోలెరమ్మ, పెద్దమ్మ, మారెమ్మ, ఉప్పలమ్మగా కొలువై ఊరును రక్షిస్తుందని ప్రతీతి. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో రూపంలో కొలిచినా అందరమ్మలకు మూలపుటమ్మ అయిన పరాశక్తి కరుణ అందరిపై ఉంటుందని నమ్మకం. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగల్లో బోనాలు ఒకటి. వర్షాలు సమృద్ధిగా కురువాలని, అంటువ్యాధులు ప్రబలకుండా అనారోగ్యాల నుంచి, విపత్తుల నుంచి కాపాడి పాడిపంటలతో చల్లగా చూడమని ఏటా ఆషాడమాసంలో పూజలు చేయడం ఆనవాయితీ. అమ్మవార్లకు బోనమెత్తి నైవేద్యం సమర్పించి, కానుకలతో సంతృప్తి పరిచి చల్లంగా చూడమని వేడుకుంటారు. జిల్లాలో ఆది, బుధవారాల్లో ఎక్కువగా అమ్మవార్లకు బోనాలను నిర్వహించి, జంతు బలి ఇవ్వనున్నారు. సాధారణ రోజుల్లో భక్తులు తక్కువగా బోనం మొక్కు చెల్లించుకుంటారు. ఈ మాసం అంతా అమ్మవార్లకు ప్రతీ రోజు ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

బోనం విశిష్టత

బోనం అంటే అమ్మవారికి భోజనం. అమ్మవారు ఆషాఢమాసంలో పుట్టింటికి వస్తుందని, తల్లికి నైవేద్యం సమర్పించి, సారెతో తిరిగి అత్తింటికి సాగనంపడం బోనాల విశిష్ఠత. మహిళలు కొత్త కుండ లేదా రాగి, ఇత్తడి పాత్రలకు పసుపు రాసి, కుంకుమతో బొట్లు పెడతారు. అన్నంతో పాటు పాలు, బెల్లంతో నైవేద్యాన్ని తయారు చేసి పాత్రలో వేస్తారు. దాని చుట్టూ వేపమండలను కడతారు. పాత్రపై మూత పెట్టి దీపం వెలిగిస్తారు. ఆ బోనాన్ని మహిళలు తలపై పెట్టుకుని ఆలయాలకు బయలుదేరుతారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల వీరంగంతో నడుస్తారు. ఆలయాలకు చేరుకున్నాక అమ్మవారికి బోనాలను నివేదిస్తారు. నీళ్లు, కల్లుతో సాక పెడతారు. బోనంతో పాటు దుష్టశక్తులను పారదోలడానికి గొర్రెలు, మేకలు, కోళ్లు బలిస్తుంటారు. అమ్మవారి సోదరుడిగా భావించే పోతరాజును ప్రతిబింబించే వ్యక్తి గావు పడుతుంటాడు. అమ్మవారికి బోనం సమర్పించడంతో పాటు ఆ ప్రసాదాన్ని కుటుంబసభ్యులు, అతిథులతో పాటు భుజిస్తారు.

సీజనల్ ముప్పుపై అప్రమత్తం



చిన్నకోడూర్‌లో మురుగు కాల్వ

- వ్యాధులపై సిబ్బందితో విడతల వారీగా అవగాహన
- వైద్యశాఖాధికారి కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు
- అందుబాటులో ఉన్న మందులు, ఫ్లూయిడ్‌లు

సిద్దిపేట టౌన్, జూలై 6 : సీజనల్ వ్యాధులు పొంచి ఉండటంతో జిల్లా వైద్యశాఖ అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీ, సబ్ సెంటర్, ఏరియా, జిల్లా జనరల్ ఆసుపత్రులను అలర్ట్ చేసింది. జిల్లా వైద్యశాఖాధికారి పుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు పీహెచ్‌సీ సెంటర్లను తనిఖీ చేస్తూ పలు వ్యాధులకు సంబంధించిన మందులు, ఫ్లూయిడ్‌ల వివరాలపై ఆరా తీస్తున్నారు. దాంతో పాటు వైద్యశాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది, నర్సులు, ఆశాలతో పలు విడతలుగా సమావేశం నిర్వహిస్తూ పొంచి ఉన్న డెంగ్యూ, మలేరియా, డయేరియాపై అవగాహన కల్పిస్తున్నారు. వ్యాధులు సోకితే రోగులకు అందించాల్సిన వైద్య చికిత్సపై వివరిస్తున్నారు. వైద్యులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి, అప్రమత్తంగా ఉండాలని నిర్దేశిస్తున్నారు.

టోల్ ఫ్రీ నంబర్ ద్వారా చర్యలు

జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులపై సిబ్బంది వెనువెంటనే స్పందించేందుకు కలెక్టర్ మనుచౌదరి ఆదేశాల మేరకు వైద్య శాఖాధికారులు టోల్ ఫ్రీ నంబర్ 6303696647ను ఏర్పాటు చేశారు. డెంగ్యూ, మలేరియా, డయేరియా లక్షణాలున్నట్లు కనిపిస్తే ఈ నంబర్‌కు తెలియజేస్తే ఆయా ప్రాంతాల సిబ్బందిని అలర్ట్ చేయడంతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అధికారులు చేరుకొని చికిత్స అందించనున్నారు. దాంతో పాటు వ్యాధి ఏ విధంగా సోకిందో ఆ ప్రాంతాలను పరిశీలించి, వీలైతే చుట్టుపక్క పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోనున్నారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

ఓ వైపు సీజనల్ వ్యాధులు వస్తాయని వైద్య శాఖ అధికారులు అన్నీ ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో జిల్లాలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. దీంతో పలు మురుగు కాలువల్లో చెత్త చెదారంతో పాటు మురుగు నీరు నిలిచిపోతున్నా దానిని శుభ్రం చేయడంలో గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారు. గ్రామాల్లో పాలన గడువు ముగియడంతో అధికారుల నిర్వహణలో ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో విఫలమవుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షకాలంలో ఇల్లు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వలేకుండా చూసుకోవాలి
- ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే అందులో ఆయిల్ బాల్స్ వేయాలి. లేదంటే క్రిమిసంహారక మందులు, కిరోసిన్ చల్లాలి
- పాత కూలర్లు, కొబ్బరిచిప్పలు, పగిలిన కుండలు, సీసాలలో, పాత టైర్లు, డ్రమ్ములు, వాడని రోళ్లు, నీటి తొట్టి, పూలతొట్టిలలో నీరు నిల్వ లేకుండా చూడాలి.
- ఇంట్లోకి దోమలు రాకుండా మెష్‌డోర్, బెడ్‌లపై దోమతెరను ఏర్పాటు చేసుకోవాలి.
- మున్సిపల్ సహకారంతో వార్డుల్లో, పంచాయతీ సహకారంతో గ్రామాల్లో దోమల మందు పిచికారీ, ఫాగింగ్ చేయాలి.



వైద్య సేవలందించేందుకు అప్రమత్తంగా ఉన్నాం

సీజనల్ వ్యాధుల పట్ల జిల్లాలోని వైద్యులు, అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశాం, జిల్లాలోని అన్నీ పీహెచ్‌సీలలో మందులు, ఫ్యూయిడ్‌లను అందుబాటులో ఉంచాం. మెరుగైన వైద్య సేవలందించేందుకు రోగులకు అవసరమయ్యే బ్లడ్ టెస్టులు, యూరిన్ టెస్టులు చేసేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఇప్పటివరకు జిల్లాలో డెంగ్యూ, మలేరియా, డయేరియా లక్షణాలున్నట్లు ఎలాంటి కేసులు నమోదు కాలేదు.

\- పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌వో

ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

- మొదటి రోజు 425 మంది హాజరు



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

నంగునూరు, జూలై 6 : ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నంగునూరు మండలం రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఈ 6 నుంచి 10 వరకు ఎప్‌సెట్ కౌన్సెలింగ్ వెరిఫికేషన్ కార్యక్రమాలు కొనసాగుతాయని ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలిపారు. మొదటి రోజు 425 మంది సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్ పూర్తయిందని, మొదటిరోజు హాజరుకాని అభ్యర్థులు ఉంటే మరుసటిరోజు రావచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

తమ్ముడి భార్యపై అత్యాచారం

- వీడియో తీసి సహకరించిన భార్య
- నిందితుల అరెస్ట్

దుబ్బాక/అక్బర్‌పేట- భూంపల్లి, జులై 6 : సొంత తమ్ముడి భార్యపై ఓ ప్రబుద్ధుడు అత్యాచారం చేసి వీడియో తీసి బెదిరించిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో శనివారం వెలుగుచూసింది. శనివారం దుబ్బాక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్ కేసు వివరాలను వెల్లడించారు. మండంలోని ఓ గ్రామానికి చెందిన ఒకడు సొంత తమ్ముడి భార్యపై కన్నేశాడు. ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడు. అతను అత్యాచారం చేస్తుండగా.. నిందితుడి భార్య వీడియో తీసింది. ఆ వీడియో సహాయంతో పలుమార్లు ఆమెపై అత్యాచారం చేశాడు. అయితే, ఈ విషయాన్ని బాధితురాలు అత్తామామల దృష్టికి తీసుకెళ్లగా.. వారూ పట్టించుకోలేదు. దీంతో ఆమె శనివారం భూంపల్లి పోలీసులను ఆశ్రయించింది. దుబ్బాక సీఐ శ్రీనివాస్ నిందితుడితో పాటు అతడికి సహకరించిన భార్యపైనా కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించగా బాధితురాలిని రిహాబిటేషన్ సెంటర్‌కు పంపించారు.

వలస కూలీలతో జోరుగా నాట్లు

మద్దూరు, జూలై 6 : ఓవైపు వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధం కాగా కూలీల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. సమయానుకూలంగా వరి నాట్లు వేసేందుకు వలస కూలీలను రప్పించుకుంటున్నారు. మద్దూరు మండలంలో నాట్లు వేసేందుకు సూర్యాపేట నుంచి కూలీలు వచ్చారు. పోలే కనకమ్మకు చెందిన 80 మంది మండలంలో వరి నాట్ల పనుల్లో బిజీబిజీగా మారారు. మద్దూరు గ్రామానికి చెందిన మహమ్మద్ కలీల్ తనకున్న 10 ఎకరాల పొలంలో వరినాట్లు వేసేందుకు ఎకరాకు రూ.6,500 చొప్పున గుత్తకు ఇచ్చారు. ఒకేరోజు వరినాట్లు ముగుస్తుండటంతో సమయం కలిసి వస్తుందని, ఇతర పనులపై దృష్టిపెట్టే అవకాశం ఉంటుందని రైతు తెలిపారు.

రోజుకు రూ.వెయ్యిపైగానే కూలీ



రోజుకు వెయ్యికి పైగా కూలీ పడుతోంది. మేము 80 మంది వరకు ఉన్నాం. సీజన్ కాబట్టి నెలపది రోజులు ఇక్కడే ఉంటాం. ఎకరానికి రూ.6500 చొప్పున మాట్లాడుకుని ఎన్ని ఎకరాలు ఉంటే ఎంత మంది అవసరముంటారో వాళ్లను నాట్లు వేసేందుకు పంపిస్తుంటాను. వ్యవసాయ పొలాలు దూరంగా ఉంటే ఆటో ఖర్చులకు అదనంగా రూ.500 తీసుకుంటాం. ఒక్కరోజులోనే ఆ రైతులకు నాట్లు వేస్తాం. ఉదయం 5 గంటలకు వచ్చి సాయంత్రం 6 గంటల వరకు పూర్తి చేస్తాం.

\- పోలె కనకమ్మ



మద్దూరులో రైతు కలీల్ పొలంలో వరినాట్లు వేస్తున్న సూర్యాపేట వలస కూలీలు

మల్లన్న ఆలయ చైర్మన్ గిరి ఎవరికి?

మాకంటే మాకే ఇవ్వాలంటూ ప్రయత్నాలు

చేర్యాల, జూలై 6 : కొమురవెల్లి మల్లన్న ఆలయం చైర్మన్ పదవి ఎవరికి కట్టబెడతారో చర్చనీయాంశమైంది. ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి ప్రభుత్వం దేవాదాయశాఖ ద్వారా ఇటీవల చర్యలు తీసుకున్న నేపథ్యంలో చైర్మన్ కుర్చీపై పాగా వేయడానికి పలువురు పోటీపడుతున్నారు. పదేళ్ల అనంతరం కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చినందున ఆశావహుల సంఖ్య భారీగానే ఉన్నది. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొమురవెల్లి క్షేత్రం కొనసాగిన సమయంలో రెడ్డి సామాజికవర్గానికే చైర్మన్ పదవిని ఎక్కువగా కట్టబెట్టారు. మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దళితుడైన ముస్త్యాల కిష్టయ్యకు చైర్మన్ పదవి దక్కింది. తదనంతరం ఇతర బీసీ వర్గాలు పదవిని అలంకరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం గొల్లకురుమలకే చైర్మన్ పదవి కట్టబెట్టారు. తదనంతరం నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాల దృష్ట్యా రెండు దఫాలు రెడ్డీలకు ఇవ్వగా, పదేళ్లలో గొల్లకురుమలకే ఎక్కువసార్లు అవకాశమిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పునరుద్ధరణ కమిటీని నియమిస్తూ రెడ్డి సామాజికవర్గానికి చైర్మన్ పదవి ఇచ్చారు. కొద్దిరోజుల క్రితం గడువు పూర్తవడంతో రెగ్యులర్ కమిటీ నియామకానికి కసరత్తు చేస్తున్నారు. 100మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. రెండు సామాజిక వర్గాల నేతలు ఎవరికి వారుగా మద్దతుకూడగట్టుకుని అధిష్టానంతో పట్టుబడుతున్నారు. మున్ముందు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయంగా కలిసివస్తుందన్న ఆలోచననూ ప్రతిపాదిస్తూ పావులు కదుపుతున్నారు. స్థానిక, జిల్లా నేతలు ఒకవైపు నిలిస్తే, రాష్ట్రస్థాయి నేతలు మరోవైపు మద్దతిస్తున్నారు. ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దీనికి తోడు యాదవ సంఘం నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో మల్లన్న ఆలయ చైర్మన్ ఏ సామాజికవర్గానికి అప్పగించనున్నారన్నది ఆసక్తి రేపుతుంది.



కొమురవెల్లి మల్లన్న క్షేత్రం

సబ్సిడీపై డ్రిప్ పరికరాలు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ
- 3,300 ఎకరాల్లో బిందు సేద్యం లక్ష్యం

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 6 : పెట్టుబడి ఖర్చు పెరుగుతుండటం, అధిక నీటి వినియోగం, దిగుబడి తగ్గుతుండటం వంటి పరిస్థితులు అన్నదాతలను కుంగదీస్తున్నాయి. ఈ నేపథ్యంలో బిందు, తుంపర సేద్యం ద్వారా సాగు వ్యయం తగ్గించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. బిందు సేద్యం ద్వారా 50 శాతం నీటి ఆదాతో పాటు ఎరువులు, కూలీల ఖర్చు తగ్గుతుందని ఉద్యాన శాఖ అధికారులు పేర్కొంటున్నారు. డ్రిప్ సాగును విస్తరింపజేయాలని ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశించడంతో ఈ వానాకాలం సీజన్ నుంచే అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 3,300 ఎకరాల్లో బిందు సేద్యాన్ని ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో సుమారు 2000 ఎకరాలు ఆయిల్‌పామ్, 1300 ఎకరాల్లో ఇతర ఉద్యాన, కూరగాయల సాగుకు ప్రోత్సాహం అందించనున్నారు. స్ప్రింక్లర్లు 516 యూనిట్లు పంపిణీ



లక్ష్యంగా నిర్ధయించారు. డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. వివరాలకు మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలని అగ్రికల్చర్ ఆఫీసర్ పేర్కొన్నారు.

సబ్సిడీ ఇలా...

బిందు సేద్యం డ్రిప్ పరికరాలు ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీపై అందజేస్తారు. వారు ఏడు శాతం జీఎస్టీ చెల్లిస్తే సరిపోతుంది. బీసీ, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ, ఐదు ఎకరాలపైన ఉన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందించనున్నారు. దాదాపు ఒక యూనిట్ ధర రూ.1,44,202 ఉండగా సబ్సిడీ పోనూ మిగతా డబ్బు, అదనంగా జీఎస్టీ రైతు చెల్లించాల్సి ఉంటుంది. తుంపర్ల(స్ప్రింక్లర్లు) పరికరాల యూనిట్ ధర రూ.23,385 ఉండగా 75 శాతం సబ్సిడీతో అందించనున్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా బిందు సేద్యం లక్ష్యాన్ని నిర్ధయించాం. 3,300 ఎకరాలకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోంది. బిందు సేద్యంపై రైతుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ కొనసాగుతుంది.

\- సువర్ణ, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి

ఐలాపూర్ మళ్లీ కబ్జాల కలకలం



వివాదాస్పద భూములు కొనుగోలు చేయవద్దని ఐలాపూర్ గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

- వివాదాస్పద భూముల్లో అక్రమార్కుల ప్రవేశం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ సిబ్బంది

పటాన్‌చెరు, జూలై 6: వివాదాస్పద ఐలాపూర్ భూముల్లో మళ్లీ కబ్జాదారుల కదలికలు ప్రారంభమయ్యాయి. అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో కోర్టు వివాదంలో నలుగుతున్న భూములను పరిరక్షించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రాజగోపాల్‌నగర్‌గా లేఅవుట్ చేసిన స్థలాలను దొడ్డిదారిన కబ్జా చేసి విక్రయించే పనులు ఊపందుకున్నాయి. సదరు భూములపై హక్కుల కోసం రాజగోపాల్‌నగర్ ప్లాట్ల బాధితులు కోర్టులో న్యాయ పోరాటం చేస్తుండగానే.. అసైన్‌మెంట్‌దారుల పేరిట భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఐలాపూర్ గ్రామంలో సర్వే నంబర్ 1 నుంచి 220 వరకు ఉన్న సర్వే నంబర్లలోని వందల ఎకరాల భూములపై హైకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకవైపు ప్రభుత్వం మరో వైపు ప్లాట్ల యజమానులు, గ్రామ రైతులు భూములు తమకే చెందాలని న్యాయపోరాటం చేస్తున్నారు. ఇదే అదనుగా వివాదాస్పద భూములను ఆక్రమించి సొమ్ము చేసుకునే ల్యాండ్ మాఫియా ముఠాలు రంగంలోకి దిగాయి. గతంలో వివాదాస్పద భూముల్లో ప్లాట్లు చేసి నోటరీల ద్వారా విక్రయించి కోట్లాది రూపాయలు దండుకున్న భూ మాఫియా అధికారుల చర్యలతో కొద్దిరోజులు స్తబ్దుగా ఉన్నది. కానీ, ఇటీవల పలు సర్వే నంబర్లలో నాట్ టు ఎంటర్ ఫియర్ పేరుతో కోర్టు డిక్రీని చూపిస్తూ భూములను చదును చేస్తున్నారు.



ఐలాపూర్ భూములను చదును చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు

గతంలో కూల్చివేతలు

గతంలో ఇదే గ్రామంలో నోటరీల ద్వారా ప్లాట్లు కొనుగోలు చేసి నిరుపేదలు కట్టుకున్న వందల ఇళ్లను రెవెన్యూ సిబ్బంది కూల్చివేయడం వివాదాస్పదమైంది. మరోసారి నోటరీ ద్వారా ప్లాట్ల విక్రయానికి సిద్ధమవుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఆ భూములను చదును చేస్తున్నారన్న సమాచారంతో అమీన్‌పూర్ డిప్యూటీ తహసీల్దార్ బాల్‌రాజ్ సంఘటనా స్థలానికి వెళ్లి పనులను అడ్డుకున్నారు. కాగా, ఐలాపూర్‌లో జరుగుతున్న అక్రమాలపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సమగ్ర నివేదిక సమర్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు సమాచారం.

పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ షురూ

- నాలుగేళ్ల సీనియారిటీ పూర్తిచేసుకున్నవారి వివరాల సేకరణ
- జిల్లాలో 647 గ్రామపంచాయతీలు, 639 మంది కార్యదర్శులు

సంగారెడ్డి టౌన్, జూలై 6 : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 80 ప్రకారం జిల్లాలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం పంచాయతీ కార్యదర్శుల వివరాలు సేకరిస్తుంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నాలుగేళ్ల సీనియార్టీ పూర్తయిన జాబితాను మండల పరిషత్ అధికారుల నుంచి సేకరిస్తున్నారు.

షెడ్యూల్ ఇలా..

ఈ నెల 5న ప్రారంభించిన పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియను 20వ తేదీ లోపు పూర్తి చేయనున్నారు. ఈ నెల 8 వరకు జిల్లాలో నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన పంచాయతీ కార్యదర్శుల వివరాలు సేకరించనున్నారు. 9 నుంచి 12వ తేదీ వరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. 13 నుంచి 18 వరకు దరఖాస్తులను పరిశీలన పూర్తిచేసి ప్రాధాన్యత జాబితాను ప్రకటించనున్నారు. 19, 20 తేదీలలో బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు అందజేస్తారు.

జిల్లాలో 639 మంది కార్యదర్శులు

సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలుండగా 639 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 428 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కాగా.. 347 మంది రెగ్యులరైజ్ అయ్యారు. గ్రేడ్-1 కార్యదర్శులు 25 మంది, గ్రేడ్-2 కార్యదర్శులు 21, గ్రేడ్-3 కార్యదర్శులు 120, గ్రేడ్-4 కార్యదర్శులు 45 మంది ఉన్నారు. కాగా 1 గ్రేడ్ నుంచి 3 గ్రేడ్ వరకు రాష్ట్ర స్థాయిలో బదిలీలు చేస్తారు. గ్రేడ్-4, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జిల్లాస్థాయిలో చేపట్టనున్నారు.

పెంపుడు జంతువులతో అప్రమత్తంగా ఉండాలి

- మెదక్ పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.వెంకట్

మెదక్ అర్బన్, జూలై 6: పెంపుడు జంతువులతో అప్రమత్తంగా ఉండాలని మెదక్ పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.వెంకట్ సూచించారు. వీటి ద్వారా సోకే వ్యాధుల్లో చాలావరకు ప్రాణాంతకమైనవి ఉన్నాయని పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశు వైద్యశాలలో ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకా శిబిరంతో పాటు కుక్కల పెంపకందారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 120 పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలను వేశారు. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా టీకాలు, వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. వారంరోజుల పాటు టీకా కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డా.లక్ష్మణ్, జేవీవో సల్లావొద్దీన్, గోపాల్, ఎల్ఎస్‌ఏ శివాజీ, వీఏలు రాకేష్, భానుచందర్, ఓఎస్ ప్రభాకర్ పాల్గొన్నారు.



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న డా.వెంకట్

కోర్టు ఏర్పాటుకు భవనం పరిశీలన

జిన్నారం, జూలై 6: మండల కేంద్రం జిన్నారంలో కోర్టు ఏర్పాటు కోసం ఎంపిక చేసిన ఐకేపీ భవనాన్ని జిల్లా న్యాయాధికారి భవానీ చంద్ర శనివారం పరిశీలించారు. భవనంలో కోర్టు ఏర్పాటుకు ఉన్న వసతులను తెలుసుకున్నారు. కాగా న్యాయమూర్తికి తహసీల్దార్ భిక్షపతి, సీఐ సుధీర్‌కుమార్, న్యాయవాది శ్రీధర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ విజయరావు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఏర్పాటు కోసం భవనాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి భవానీచంద్ర, అధికారులు, న్యాయవాదులు

ఆర్టీసీ బస్సు ఢీ, బాలుడికి గాయాలు

నర్సాపూర్, జూలై 6: నర్సాపూర్ బస్టాండు వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో బాలుడి(10) కాలుకు తీవ్ర గాయమైంది. మెదక్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నర్సాపూర్ బస్టాండ్‌లోకి వెళ్తున్నది. అదే సమయంలో కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన తేజ్(5) బాలుడు రోడ్డు దాటుతుండగా.. బస్సుకు తగిలాడు. దీంతో కాలుకు తీవ్ర గాయమైంది. బస్టాండ్‌లో బస్సును ఆపి బాలుడిని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని స్థానికులు డ్రైవర్‌ను ఒత్తిడి చేశారు. దీంతో బాలుడిని తీసుకెళ్లి చికిత్స చేయించాడు.

బోరు బావిలో పడి వ్యక్తి మృతి





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, స్వామి(ఫైల్)

నిజాంపేట, జూలై 6: మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి బోరు బావిలో పడి మృతిచెందిన సంఘటన నిజాంపేట మండలంలో చోటు చేసుకున్నది. రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామానికి చెందిన కొంతలపల్లి స్వామి(43) మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. ఆరురోజుల క్రితం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ దుబ్బాక మండలం పోతారెడ్డిపేటలోని అక్క వద్దకు పోయాడు. అక్కడ బోరు బావి వద్దకు వెళ్లి అందులో పడి చనిపోయాడు. భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నర్సాపూర్, జూలై 6: స్థలం విషయంలో న్యాయం జరగలేదని మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నర్సాపూర్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మల్లేష్(40) తన ఇంటి సమీపంలో ఉన్న ఖాళీ స్థలం విషయంలో మరొకరితో వివాదం కొనసాగుతోంది. ఈ విషయమై గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టారు. అక్కడ కూడా న్యాయం జరగలేదని మనస్తాపానికి గురైన మల్లేష్ ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే నర్సాపూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలించినట్లు తెలిపారు.

ప్రతీ గ్రామంలో జ్వర సర్వే నిర్వహించాలి

- డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డా.శిరీష



మాట్లాడుతున్న డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డా.శిరీష

సంగారెడ్డి అర్బన్, జూలై 6: వర్షాకాలంలో జ్వరాలు నమోదయ్యే అవకాశం ఎక్కువగా ఉన్న కారణంగా ప్రతీ గ్రామంలో ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటుచేసి జ్వర సర్వే నిర్వహించాలని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డా.శిరీష సూచించారు. సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజరీ సిబ్బంది ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం మొత్తం ప్రతి రోజు డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటింటి సర్వేచేసి అన్నిరకాల ఆరోగ్య సమస్యలపై ఆశాలు ఆరాతీసి నివేదిక సమర్పించాలన్నారు. తాగునీటి పైపులైన్ లీకేజీలను గమనిస్తే వెంటనే పంచాయతీ సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డా.ప్రవీణ్, సహాయ మలేరియా అధికారి శ్రీరాంసుధాకర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ప్రజావాణి

మెదక్ అర్బన్, జూలై 6: పరిపాలన ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో సోమవారం నుంచి జిల్లాలోని అన్ని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించనున్నట్లు మెదక్ రెవెన్యూ డివిజనల్ అధికారి రమాదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి ప్రజలు ఆయా మండలానికి సంబంధించిన సమస్యను ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు రూపంలో అందజేయాలన్నారు. భూ సమస్యలు పరిష్కారానికి ధరణి ఏ మాడ్యూల్‌పై దరఖాస్తు చేయాలనే అంశంపై తహసీల్దార్ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌లో, మీసేవా కేంద్రాల్లో ప్రజలకు తెలిసే విధంగా తెలుగులో స్పష్టంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను తహసీల్దార్లు తక్షణమే పరిష్కరించాలన్నారు. ఉదయం 10:30 నుంచి 2:30 గంటల వరకు ప్రజావాణి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. మండలస్థాయిలో ప్రజావాణి నిర్వహించడంతో ప్రజలకు దూరభారంతో పాటు వ్యయ ప్రయాసలు తగ్గనున్నాయని ఆమె పేర్కొన్నారు.

పుట్టగొడుగుల్లా సీడ్స్, ఫర్టిలైజర్ షాపులు

- అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా ఏర్పాటు
- రైతులకు అంటగడుతున్న నకిలీ విత్తనాలు, ఎరువులు
- కొరవడిన వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ



అక్కన్నపేట మండలం రామవరంలో ఓ సీడ్స్, ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న మండల వ్యవసాయ అధికారి నాగరాజు (ఫైల్)

అక్కన్నపేట, జూలై 6: అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో సీడ్స్, ఫర్టిలైజర్స్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వానాకాలం సీజన్ మొదలుకావడంతో అన్నదాతలు స్థానికంగా ఉన్న సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపులకు వెళ్లి పత్తి, మొక్కజొన్న, వరి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న షాపుల నిర్వాహకులు దిగుబడి బాగా వస్తుందంటూ పలు కంపెనీలు ఇచ్చే ఆఫర్లు, లాభాలు బాగా వచ్చే విత్తనాలను అంటగడుతున్నారు. దీనికితోడు పంటల తెగుళ్ల నివారణకు దుకాణాల నిర్వాహకులు రైతులకు ఇష్టమొచ్చిన పెస్టిసైడ్స్, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

సిద్దిపేట జిల్లాలో మూడు లక్షల మంది రైతులు ఉన్నారు. ఈ వానాకాలంలో 5.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయి. మూడు లక్షల ఎకరాల్లో వరి, 1.80 లక్షల ఎకరాల్లో పత్తి, 60 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 10 వేల ఎకరాల్లో కంది పంటలు సాగు చేసే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలోనే జిల్లావ్యాప్తంగా ఉన్న మండలాల్లోని పలు గ్రామాల్లో అనుమతులు లేకున్నా సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపులు కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. కొంతకాలంగా నకిలీ విత్తనాలు, ఎరువులకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నా వ్యవసాయ అధికారులు అటువైపు చూడడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ అప్పుడప్పుడు తనిఖీలు చేపడుతూ ఫొటోలకు ఫోజులు ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

డీలర్లకు కంపెనీల ఆఫర్లు

పలు సీడ్స్, పెస్టిసైడ్స్ కంపెనీలు డీలర్లకు విదేశీ టూర్లు, ప్రత్యేక ప్యాకేజీల ఆఫర్లు ఇస్తుండడంతో ఆ కంపెనీలకు చెందిన విత్తనాలు, పెస్టిసైడ్స్‌ను రైతులకు మాయమాటలు చెప్పి విక్రయిస్తున్నారు. ఎక్కువగా టార్గెట్లు పూర్తిచేసిన డీలర్లను జల్సాల కోసం పలు కంపెనీలు టూర్లకు పంపిస్తున్నాయి. కానీ నకిలీ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు మాత్రం పంట దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో అప్పులు ఎక్కువై ఆత్మహత్యకు పాల్పడుతున్న సందర్భాలూ ఉన్నాయి.

అనుమతులు తప్పనిసరి

- ఫర్టిలైజర్స్‌కు ఆన్‌లైన్‌లో, పెస్టిసైడ్స్‌కు మాన్యువల్‌గా దరఖాస్తులు చేసుకోవాలి.
- ఫర్టిలైజర్స్‌కు ఏడీఏ, సీడ్స్, పెస్టిసైడ్స్‌కు జిల్లా వ్యవసాయ అధికారి అనుమతులు ఇస్తారు.
- పెస్టిసైడ్స్‌కు బీఎస్సీ సైన్స్, సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్‌కు డిప్లొమా అగ్రికల్చర్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
- షాపుల నిర్వాహకులకు అర్హతలు లేకపోతే సర్టిఫికెట్స్ కలిగిన వ్యక్తులను టెక్నికల్ పర్సన్స్‌గా పెట్టుకోవాలి.
- పెస్టిసైడ్స్‌కు లైఫ్ టైం అనుమతి కాగా, ఫర్టిలైజర్స్‌కు మూడేళ్లు, సీడ్స్‌కు ఐదేళ్ల వరకు అనుమతి ఉంటుంది. తదుపరి తప్పనిసరిగా రెన్యూవల్ చేసుకోవాలి.

ట్రాక్టర్లు ఆపితే తొక్కిస్తాం..

- రెచ్చిపోతున్న ఇసుక మాఫియా
- ముస్తాబాద్ సంఘటన పునరావృతం అవుతుందా..?
- విధులు నిర్వహించాలంటే ఆందోళన చెందుతున్న సిబ్బంది



రెవెన్యూ సిబ్బంది పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

నారాయణరావుపేట, జూలై 6: రోజురోజుకూ ఇసుక అక్రమ రవాణా మాఫియా రెచ్చిపోతోంది. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ సిబ్బంది వాహనాలు నిలువరించే ప్రయత్నం చేస్తే ట్రాక్టర్లను సిబ్బంది మీదికి తీసుకుపోయే యత్నం చేస్తున్నారని వాపోతున్నారు. ఇసుక ట్రాక్టర్లకు అడ్డొచ్చి ఆపే ప్రయత్నం చేస్తే.. తొక్కిస్తామంటూ దౌర్జన్యానికి దిగుతున్నారు. శుక్రవారం రాత్రి సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నారాయణరావుపేట మండల కేంద్రం మీదుగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని రెవెన్యూ అధికారులకు సమాచారం రావడంతో జూనియర్ అసిస్టెంట్ రెండు ట్రాక్టర్లను పట్టుకున్నాడు. వెంటనే ఇసుక అక్రమ వ్యాపారం చేసే కొంతమంది జూనియర్ అసిస్టెంట్ సాయితో వాగ్వాదానికి దిగారు. ఇసుక రవాణా చేస్తాం.. ఆపేందుకు మీరెవరు అంటూ దురుసుగా ప్రవర్తించారని బాధితుడు ఆరోపించాడు. విషయం ఉన్నతాధికారులకు, పోలీసులకు తెలియజేయడంతో పోలీసులు వచ్చి రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు సమాచారం.

ఆందోళనలో రెవెన్యూ సిబ్బంది

వాల్టా చట్టం పరిరక్షణకు కృషిచేస్తూ ఇసుక అక్రమ, మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలంటే క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది ఆందోళనకు గురవుతున్నట్లు తెలిసింది. ఇటీవలే రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇసుక మాఫియా కానిస్టేబుల్‌ను డ్రైవర్ ట్రాక్టర్‌తో సహా చెరువులోకి తోసేసిన సంఘటన మరువకముందే నారాయణరావుపేటలో ఇసుక అక్రమ రవాణా మాఫియా అదే హెచ్చరికలు చేయడంతో రెవెన్యూ సిబ్బంది ఆత్మరక్షణలో పడ్డారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఇసుక మాఫియా రెచ్చిపోతున్నారని తెలిసింది. రెవెన్యూ సిబ్బందిపై దురుసుగా వ్యవహరించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం.

- ఉదయ శ్రీ, తహసీల్దార్, నారాయణరావుపేట

వ్యవసాయ బావి వద్ద సంపులో పడి రైతు మృతి





మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న రజక సంఘం నాయకులు, యాదగిరి(ఫైల్)

జగదేవ్‌పూర్, జూలై 6: ప్రమాదవశాత్తు సంపులో పడి రైతు మృతిచెందిన సంఘటన జగదేవ్‌పూర్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బస్వరాజు యాదగిరి(50) అనే రైతు శుక్రవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్ద ఉన్న సంపులోకి దిగి విద్యుత్ మోటార్‌ను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలై నీటిలో మునిగిపోయాడు. భార్య పరిసర ప్రాంతంలోని రైతుల సహాయంతో బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా బస్వరాజు యాదగిరి కుటుంబసభ్యులను రజక సంఘం మండలాధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్ పరామర్శించారు. అనంతరం మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అలిరాజపేట రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల నర్సింహులు, నర్సయ్య, చంద్రమౌళి, కుమార్, ఐలేని, నరేష్, రాజయ్య పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సిద్దిపేట జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగత్ కుమార్‌రెడ్డి



పెంపుడు జంతువుకు టీకా వేస్తున్న జగత్ కుమార్ రెడ్డి, ఏడీఏ

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 6: పెంపుడు జంతువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జగత్‌కుమార్‌రెడ్డి సూచించారు. సిద్దిపేటలోని పశువుల ఆస్పత్రిలో శనివారం ప్రపంచ జూనిసిస్ సందర్భంగా ఏడీఏ డాక్టర్ సత్యప్రసాద్‌రెడ్డితో కలిసి పెంపుడు కుక్కలకు, పిల్లులకు రేబిస్ నివారణ టీకాలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులు, ఇతర జంతువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్య కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని చావడి వీధిలోని ఓ ఇంటి ఆవరణలో కుక్కల గుంపు



పట్టణంలో గుంపులుగా సంచరిస్తున్న కోతులమూక



మురుగునీరు, వ్యర్థాలతో నిండి దోమలమయమైన డ్రైనేజీ కాలువ

కుక్కలు.. కోతులు.. దోమలు..!

- చేర్యాల పట్టణంలో విజృంభన
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

చేర్యాల, జూలై 6: చేర్యాల పట్టణంలో రోజురోజుకూ కుక్కలు, కోతులు, దోమల స్వైరవిహారం పెరిగిపోతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీధుల్లో ఎక్కడచూసినా కుక్కలు, కోతులు గుంపులుగుంపులుగా సంచరిస్తున్నాయి. దారినపోయేవారిపై కుక్కలు దాడిచేస్తూ గాయాలపాలు చేస్తుండగా, ఆహారం కోసం కోతులు ఇళ్లలోకి చొరబడుతూ గుల్లచేస్తున్నాయి. అడ్డుకోబోయిన వారిపై దాడిచేస్తున్నాయి. వరుస సంఘటనలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొద్దిరోజుల క్రితం పోచమ్మవీధి, గాంధీ చౌక్, అంబేడ్కర్‌నగర్, పెద్దమ్మగడ్డ, అంగడిబజారు తదితర కాలనీవాసులను గాయపరచగా, రెండురోజుల క్రితం మాల కమ్యూనిటీహాల్ సమీప వాసులతో పాటు 4వ వార్డులో ఓ మున్సిపల్ సిబ్బందిని గాయపరిచాయి. కుక్కలను చంపొద్దన్న నిబంధనల పేరిట మునిసిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఉసూరుమంటున్నారు.

దోమల బెడత..

వీటికి తోడు దోమల బెడద తీవ్రంగా నెలకొన్నది. జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా డ్రైనేజీ కాలువను పూర్తిచేయకుండా అర్ధాంతరంగా వదిలేశారు. కాలువ నిర్మాణ సమయంలో రాళ్ల, రప్పలు, మట్టి వ్యర్థాలను తొలగించకపోవడంతో డ్రైనేజీ నిండి రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తున్నది. ఈ క్రమంలో దోమలు వృద్ధి చెంది స్వైర విహారం చేస్తున్నాయి. బస్టాండ్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు రోడ్డు పక్కన నిమిషం పాటు నిలబడలేని భయానక పరిస్థితి నెలకొన్నది. అధికారులు స్పందించి కోతులు, కుక్కలు బెడద తీర్చాలని కోరుతున్నారు.

రెండురోజుల క్రితం ఆరుగురికి గాయాలు

ఏ గల్లీలో చూసినా కుక్కల గుంపు ఉంటుంది. రెండురోజుల క్రితం గాయత్రీ స్కూల్ సమీపంలో పిచ్చికుక్కలు ఆరుగురిని కరిచాయి. గతంలో కూడా జనాలను గాయాలపాలు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. కోతులను పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేందుకు మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

- అంబటి శ్రీధర్, చేర్యాల

మురుగునీరు నిల్వ కోసం కాలువ కట్టినట్టు ఉంది

డ్రైనేజీ కాలువ పనులను అడ్డదిడ్డంగా, అర్ధాంతరంగా నిలిపివేశారు. మురుగునీటి మళ్లింపుకోసం కాకుండా డంపింగ్‌కోసం కాలువ కట్టినట్లుగా ఉంది. మురుగునీటి నిల్వతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్డుపక్కన నిలబడాలన్నా తంటాలు పడాల్సి వస్తుంది. బ్లీచింగ్ చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుంది.

- కె. కరుణాకర్, చేర్యాల

పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- సిద్దిపేట ఇన్‌చార్జి డీడబ్ల్యూవో శారద



చేర్యాల: మర్రిముచ్చాలలో చిన్నారుల బరువును పరిశీలిస్తున్న సిద్దిపేట ఇన్‌చార్జి డీడబ్ల్యూవో శారద

చేర్యాల/మర్కుక్, జూలై 6: పిల్లల ఎదుగుదలపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి డీడబ్ల్యూవో, చేర్యాల సీడీపీవో శారద అన్నారు. కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన ఎదుగుదల పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రమంతప్పకుండా చిన్నారుల ఎత్తు, బరువు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో కొమురవెల్లి సూపర్‌వైజర్ పావణి తదితరులు పాల్గొన్నారు.

మర్కుక్ మండలంలోని అంగడికిష్టాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఎదుగుదల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక తాజా మాజీ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీరాములుగౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వసంత, పంచాయతీ కార్యదర్శి నీలిమ, రాణి, నాగలక్ష్మి, అమ్మఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ నాగరాణి, వీవోఏ దివ్య, ఏఎన్‌ఎం బి. పాషా తదితరలు ఉన్నారు.

మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త

సిద్దిపేట అర్బన్, జూలై 6: ఆర్టీసీ డీలక్స్ బస్సులలో ప్రయాణించే మహిళలకు లక్కీడిప్ ద్వారా వెయ్యి రూపాయల విలువైన చీరలను బహుమతిగా అందజేస్తామని డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట డిపో డీలక్స్ బస్సుల్లో 170 చార్జితో సిద్దిపేట నుంచి జేబీఎస్ వరకు లేదా జేబీఎస్ నుంచి సిద్దిపేట వరకు ప్రయాణం చేసి బస్సు దిగేముందు టికెట్ వెనకాల ఫోన్ నెంబర్ రాసి, బస్సులో ఏర్పాటు చేసిన లక్కీడీప్ బాక్స్‌లో వేయాలన్నిరు. ప్రతీ 15 రోజులకొకసారి లక్కీడీప్ ద్వారా ముగ్గురు మహిళలను ఎంపిక చేసి వారికి ఒక్కొక్కరికి రూ.1000 విలువైన చీరలు బహుమతులుగా ఇస్తామని తెలిపారు. ఈ స్కీం ఈ నెల 8వ తేదీ నుంచి అమలు అవుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గేదెలు మృతి

బెజ్జంకి, జూలై 6: మండలంలోని తోటపల్లి గ్రామ శివారులోని రాజీవ్‌రహదారిపై కారు ఢీ కొట్టడంతో గ్రామానికి చెందిన రైతు బోనగం శ్రీనివాస్‌కు చెందిన రెండు గేదెలు మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ. 1.5 లక్షల వరకు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లిలో పత్తి చేనులో ఎడ్ల నాగళ్లతో కలుపు తీస్తున్న రైతులు

రైతుకు అందని 'సబ్సిడీ'

- తగ్గుతున్న వ్యవసాయ పరికరాలు
- పెట్టుబడి భరించలేకపోతున్న రైతులు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

దౌల్తాబాద్, జూలై 6: రైతు లేనిదే రాజ్యం లేదని ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు చెబుతుంటారు. అలాంటి రైతులకు ఆధునిక కాలానికి అనుగుణంగా అందిస్తామన్న వ్యవసాయ సాంకేతిక, యాంత్రీకరణ పథకాలు దరిచేయడం లేదు. గత ప్రభుత్వం వ్యవసాయ పనిముట్ల రాయితీ పథకాలను ఒక్కొక్కటిగా అటకెక్కిస్తూ.. రైతన్నల ఆశలపై నీళ్లు చల్లింది. దీంతో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపైనే కొండంత ఆశలు పెట్టుకున్నారు.

సిద్దిపేట జిల్లాలోని దౌల్తాబాద్ మండలంలోని రైతులు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటారు. మండలంలోని 24 గ్రామాల్లో 13 వేల మంది రైతులు ఉన్నారు. గతంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రోటోవేటర్, తైవాన్, స్ప్రేయర్లు, మినీట్రాక్టర్లు,టార్పాలిన్లు, నాగళ్ల వంటి అనేక రకాల సాగు పనిముట్లు సబ్సిడీపై రైతులకు అందేవి. సబ్సిడీ పథకాలు 2006-07 నుంచి ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. 2016-17 వరకు అందుబాటులో ఉన్న 10 నుంచి 12 రకాల పనిముట్లు.. ఆ తర్వాత సగానికి తగ్గిపోయాయి. తాజాగా ఆ సంఖ్య నామమాత్రమైంది. దీంతో రైతులు డబ్బులు వెచ్చించి దుకాణాల్లో వ్యవసాయ పని ముట్లను కొనుక్కుంటున్నారు. పంటలకు అధిక పెట్టుబడులు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంజూరు అంతంత మాత్రమే..

ఓ వైపు యాంత్రీకరణ పథకాలు ఒక్కొక్కటిగా నిలిచిపోతుండగా, మరోపక్క మంజూరు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. తైవాన్ స్ప్రేయర్లకు మంగళం పాడిన వ్యవసాయశాఖ.. వాటి స్థానంలో రీఛార్జ్ స్ప్రేయర్లు మంజూరు చేయడం లేదు.

సబ్సిడీతో రైతులకు మేలు..



సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు లభించడం లేదు. దీంతో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నాం. ధర అధికంగా వెచ్చించినా.. నాణ్యత లేక మోసపోతున్నాం. ప్రస్తుత ప్రభుత్వం గతంలో మాదిరిగా రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందజేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

- దాసరి సత్తయ్య, రైతు గాజులపల్లి, దౌల్తాబాద్ మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



సబ్సిడీపై పనిముట్లు, యంత్రాల కోసం రైతులు కార్యాలయానికి వస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. గతంలో ఉన్న పథకాలు రాకపోయినా ఉపయోగపడే యూనిట్లు మాత్రం మళ్లీ అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నది. ఈ విషయాన్ని రైతులు గమనించాలి.

- గోవిందరాజులు, దౌల్తాబాద్ మండల వ్యవసాయశాఖ అధికారి

ఉపాధ్యాయుల కృషితోనే ప్రభుత్వ పాఠశాల బలోపేతం



నర్మెట్ట హైస్కూల్ ఉపాధ్యాయుడు ఉపేందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ వీడ్కోలు ఆత్మీయ అభినందన సన్మాన సభలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

నంగునూరు, జూలై 6: విద్యార్థుల మనోవికాసానికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. మండలంలోని నర్మెట్ట ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అధ్యక్షతన గాడిపల్లి ఉపేందర్‌రెడ్డి పదవీవిరమణ అభినందన సన్మానసభలో డీఈవో ఎల్లంకి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుడు ఉపేందర్‌రెడ్డి సేవలను ప్రశంసించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఉపేందర్‌రెడ్డి పదోతరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించారు. ఎనిమిది మంది విద్యార్థులకు రూ.5000ల చొప్పున మొత్తం రూ.40,000లను అందించి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శశిధర శర్మ, ఇంద్రసేనారెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కనకయ్య, మండల నోడల్ అధికారి ప్రభాకర్‌రావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ చందన, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

గజ్వేల్, జూలై 6: చికిత్స పొందుతూ మహిళ మృతిచెందిన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని పిడిచెడ్‌లో శనివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన బీనమైన భార్గవి(30) కడుపు నొప్పి తాళలేక ఈ నెల 4న ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. భర్త గమనించి ఆమెను కిందికి దించి గజ్వేల్ ఆస్పత్రికి తరలించాడు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించాడు.

సమానత్వం కోసం పోరాడిన యోధుడు జగ్జీవన్‌రామ్

● వర్ధంతిలో నాయకులు

గజ్వేల్, జూలై 6: సమానత్వం కోసం పోరాడిన యోధుడు జగ్జీవన్‌రాం అని యూత్ కాంగ్రెస్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కుంట్ల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం గజ్వేల్ పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మోహన్నగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బాబుజీగా పేరు గాంచిన బాబు జగ్జీవన్‌రామ్ భారత పార్లమెంట్‌లో నలభై ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు చేపట్టారని, ఉప ప్రధానిగా కూడా వ్యవహరించారని కొనియాడారు. సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. వారితో నాయకులు సెంటూరు కుమార్, సయ్యద్ మతీన్, మోచా ప్రభాకర్, బెజుగామ యాదగిరి, అజ్గర్, సురేశ్, కప్ప భాస్కర్, జంగం రమేశ్‌గౌడ్, సమీర్, అజహర్, లక్ష్మీనారాయణ, వహీద్, సత్యం, మల్లారెడ్డి, నేత నాగరాజు, అక్కారం యాదగిరి ఉన్నారు.

● దూళిమిట్ట: మాజీ ఉపప్రధాని, సంఘసంస్కర్త, పీడీత వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని మండల కేంద్రంలో వివిధ పార్టీల నాయకులు, ఎమార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజల అభ్యున్నతికి నిరంతరం పాటుపడిన మహనీయుడని, సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని కృషిచేసిన గొప్ప సంఘసంస్కర్త అని ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌గౌడ్, ఎమార్పీఎస్ మండల అధ్యక్షుడు సుందరగిరి భాస్కర్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు స్వర్గం లక్ష్మయ్య, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చల్లా లత, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బడుగు సాయిలు, నాచగోని మహేష్, పరుశురాములు, కొంగ రమేష్, రాజయ్య, సంజీవులు పాల్గొన్నారు.



గజ్వేల్: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



సిద్దిపేట టౌన్: బాబు జగ్జీవన్‌రావు విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్: బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగిద్దామని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా వద్ద బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బలహీన వర్గాల అభివృద్ధి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, సమతావాదిగా తన పాలన దక్షతతో దేశ ఉప ప్రధానిగా దేశానికి విశేష సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రియాజుద్దీన్, నాయకులు ముద్దం లక్ష్మి, గంప మహేందర్, సాకి ఆనంద్, బుచ్చిరెడ్డి, తప్పేట శంకర్, ఎర్ర మహేందర్, గయాజుద్దీన్, గ్యాదరి మధు, మార్క సతీష్‌గౌడ్, మహిపాల్, కలిముద్దీన్, అంజయ్య, పాండు, రేణుక, రజిత, స్రవంతి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● మర్కుక్: మండలంలోని చేబర్తిలో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా మహనీయుల ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక విగ్రహాల దగ్గర పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహనీయుల ఉత్సవాల కమిటీ చైర్మన్, గ్రామ తాజా మాజీ సర్పంచ్ అశోక్, తాజా మాజీ ఉపసర్పంచ్ స్వామిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీడిత ప్రజల గొంతుకగా, ఉపప్రధాని పదవిని అలంకరించిన రాజకీయ కురువృద్ధుడు బాబు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఆయన సేవలను దేశం ఎప్పటికీ మర్చిపోదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ర్యాకం యాదగిరి, తాజా మాజీ వార్డు సభ్యులు లత, అంజనేయులు, ఉపాధ్యాయులు శ్రీధర్, ఉత్సవాల కమిటీ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.



దూళిమిట్ట: బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు



మర్కుక్: జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న నాయకులు

వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి



చిన్నకోడూరు పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న డీఎస్ఎస్ నాయకులు

చిన్నకోడూరు, జూలై 6: మండలంలోని పలు గ్రామాల్లో అధిక వడ్డీకి అప్పులు ఇస్తున్న వ్యాపారులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం చిన్నకోడూరు పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐ మురళీధర్‌గౌడ్‌కు దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కుంభాల రమేష్ మాట్లాడారు. గ్రామాలలో నిరుపేద కుటుంబాల అవసరాలను ఆసరాగా చేసుకుని వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. వడ్డీ వ్యాపారుల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వడ్డీకి అప్పులు ఇస్తున్న వారిని గుర్తించి వారిపై మనీలాండరింగ్ యాక్ట్ కింద చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీఎస్ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు ఎండీ. రజాక్, మండలాధ్యక్షుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నకోడురు ఎస్ఐ బాలకృష్ణ

నారాయణరావుపేట,జూలై6: సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిన్నకోడురు ఎస్ఐ బాలకృష్ణ సూచించారు. మండలంలోని మల్యాలలో శుక్రవారం రాత్రి పోలీసు కళాబృందంతో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. బ్యాంకు, ఆధార్‌కార్డు వివరాలను గుర్తుతెలియని వ్యక్తులకు చెప్పవద్దన్నారు. అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలు జరిగే అవకాశం ఉండదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మాట్లాడితే వెంటనే ఫోన్ కట్ చేసి ఆ నెంబర్‌ను బ్లాక్ చేయాలని తెలిపారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. కళాబృందం సభ్యులు పలు అంశాల పై అవగాహన కల్పించారు. పోలీసు కళాబృందం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకులవి అసత్య ప్రచారాలు

● వాస్తవాలు వెల్లడించేందుకు పాలకవర్గం సిద్ధంగా ఉంది

● బుగ్గ రాజేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పోదిల కిషన్



మాట్లాడుతున్న మాజీ చైర్మన్ పోదిల కిషన్

నారాయణరావుపేట, జూలై 6: బుగ్గ రాజేశ్వర స్వామి దేవస్థానంలో అవినీతి జరిగిందని బీజేపీ నాయకులు చేస్తున్నవి అసత్య ప్రచారాలని, వాస్తవాలను వెల్లడించేందుకు పాలకవర్గం, దేవాదాయ శాఖ అధికారులం కట్టుబడి ఉన్నామని బుగ్గ రాజేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పోదిల కిషన్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కొన్ని రోజుల క్రితం గాలి దుమారం కారణంగా దేవస్థానం ముందు ఉన్న ధ్వజ స్తంభం పైభాగం విరిగిందని, భక్తులకు ప్రమాదం జరగకూండా ధ్వజ స్తంభం చుట్టూ గోడ కట్టి విరిగిన భాగాన్ని ఆలయం ఆవరణలో పెట్టామని తెలిపారు. ఈ విషయాన్ని ఆలయం ఈవో దృష్టికి తీసుకెళ్లామని, ఆయన కూడా ఉన్నతాధికారులకు వివరించడం జరిగిందన్నారు. వాస్తవాలను తెలుసుకుని విమర్శించాలని, అసత్య ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సోషల్‌మీడియా నాయకులు కమల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు

రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

● ఆయిల్‌పామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి

నంగునూరు, జూలై 6: ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పూర్తిగా విస్మరించిందని ఆయిల్‌పామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి ఆరోపించారు. నంగునూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఆచరణకు సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. రైతులకు పెట్టుబడి సాయంతో పాటు రుణమాఫీపై కల్లబొల్లి కబుర్లు చెబుతూ కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్‌లో రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇంతవరకు చేయలేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా పార్టీ ఫిరాయిస్తే రాళ్లతో కొట్టండి అని చెప్పిన నాయకులు ఇప్పుడు ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకోవడంపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదన్నారు. దివ్యాంగులకు, వృద్ధులకు, బీడీ కార్మికులకు రూ.4వేల పెన్షన్ ఇస్తామన్న ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సమావేశంలో నంగునూరు సహకార సంఘం చైర్మన్ కోల రమేష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉల్లి మల్లయ్య, చింతల రాంరెడ్డి, చింతల కిష్టయ్య సిద్దు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు

● ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతి రావు



గజ్వేల్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలో మొక్కలను నాటుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు

గజ్వేల్, జూలై 6: పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఏక్ పేడ్ మా కే నామ్ ప్రచార ఉద్యమంలో భాగంగా గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలుర సముదాయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చెట్లను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ రమేష్‌బాబు, విజయభాస్కర్‌రెడ్డి, రామచంద్రం, పెద్దిరాజు, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ భవాని, అకాడమిక్ కోఆర్డినేటర్ బాలరాజు, కవిత, మార్కండేయ, లక్ష్మీనరసయ్య, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ శివరంజని

హుస్నాబాద్, జూలై 6: హుస్నాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిఫ్ కోర్టు జడ్జి శివరంజని హాజరై విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠినమైన శిక్షలున్నాయని హెచ్చరించారు. ప్రతీ విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీపీ కన్నోజు రామక్రిష్ణ, దీకొండ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఏపీ సీఎంను కలిసిన ఇల్లెందుల రమేష్

దౌల్తాబాద్,జూలై6: ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా బేగంపేట విమానాశ్రయంలో టీడీపీ మెదక్ పార్లమెంట్ అధ్యక్షుడు, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి మండలంలోని గొడుగుపల్లికి చెందిన ఇల్లేందుల రమేష్ ఆయనకు శాలువ కప్పి ఘన స్వాగతం పలికారు.

మంత్రి 'జూపల్లి'ని కలిసిన కృష్ణారెడ్డి

ములుగు, జూలై 6: రాష్ట్ర ఎక్సైజ్ టూరిజంశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కాంగ్రెస్ గజ్వేల్ యూత్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలోని కార్యకర్తలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువచేసేందుకు కృషి చేయాలన్నారు.

ఘనంగా జూనోసిస్ దినోత్సవం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న చేర్యాల అసిస్టెంట్ వెటర్నరీ డైరెక్టర్ రాజిరెడ్డి

చేర్యాల, జూలై 6: చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేర్యాల అసిస్టెంట్ వెటర్నరీ డైరెక్టర్ రాజిరెడ్డి రేబిస్, స్వైన్ ఫ్లూ, బర్డ్ ఫ్లూ, ఆంత్రాక్స్ వంటి భయంకర వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మధు, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, పరుశురాములు, మధు, శ్రీధర్, రవి, కవిత, స్వప్న, చంద్రమోహన్, అనూష, రేవతి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీకి సన్మానం

కుకునూరుపల్లి, జూలై 6: ఉమ్మడి కొండపాక మండల తాజా మాజీ వైస్ ఎంపీపీ దేవి రవీందర్‌ను శనివారం గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదిరలు పాల్గొన్నారు.

విద్యార్థికి గ్రామస్థుల ఘన సన్మానం



మూష్టం వర్షితను సన్మానిస్తున్న గ్రామస్థులు

కుకునూరుపల్లి, జూలై 6: మొట్టమొదటిసారి గ్రామం నుంచి ట్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. మంగోల్‌కు చెందిన మూష్టం వర్షిత గ్రామంలోని పాఠశాలలో విద్యను అభ్యసించింది. ఆమె బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికైంది. దీంతో గ్రామం నుంచి మొదటిసారి ట్రిబుల్ ఐటీకి ఎంపికైన సందర్భంగా గ్రామస్తులు వర్షితను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినిని మాజీ వైస్ ఎంపీపీ రవీందర్ సన్మానించారు. లకుడారం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన నాగపురి అనూష బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికైన సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో మాజీ వైస్ ఎంపీపీ దేవి రవీందర్, బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు స్వామి, కరుణాకర్, మల్లేశం, బిక్షపతి, సంతోష్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మినీస్టేడియం పనులను పూర్తి చేయాలి: సీపీఎం



మాట్లాడుతున్న నాయకులు

బెజ్జంకి, జూలై 6: మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న మినీస్టేడియం పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మినీస్టేడియాన్ని శనివారం సీపీఎం నాయకులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మినీస్టేడియం అభివృద్ధి కోసం రూ.1కోటి యాభై లక్షలు మంజూరయ్యాయని, సంవత్సరాలు గడుస్తున్నా పనులు చేపట్టకపోవడం శోచనీయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్టేడియాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొమ్మిడి సాయి, ఎల్లయ్య, రసూల్, ప్రవీణ్, శేఖర్ పాల్గొన్నారు

కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి

● కాంగ్రెస్ నాయకులు



నోట్ బుక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్, జూలై6: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, 20వ వార్డు కౌన్సిలర్ రియాజ్ పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని 21 వార్డులో ఉన్న 6వ నెంబర్ ఉర్దూ మీడియం పాఠశాలలో శనివారం కౌన్సిలర్ రియాజ్ సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉర్దూ మీడియం పాఠశాలలో కిచెన్, మూత్రశాలలకు నిధుల మంజూరు చేయించి నిర్మిస్తానన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని, పాఠశాలకు పేరు తీసుకురావలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ నాయకులు సాకి ఆనంద్, బుచ్చిరెడ్డి, షాబుద్దీన్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

రాయపోల్, జూలై 6: మండలంలోని బేగంపేట ఉన్నత పాఠశాలలో శనివారం గజ్వేల్‌కు చెందిన తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ టీ. లక్ష్మణ్, కోశాధికారి దుర్గాప్రసాద్ ఆరు, ఏడో తరగతులకు చెందిన 109 మంది విద్యార్థులకు ఇంగ్లిష్ వర్క్, హ్యాండ్ రైటింగ్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



శివ్వంపేట: పెద్ద గొట్టిముక్కల పాఠశాలలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట, జూలై 6: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కృషి చేయాలని పెద్దశంకరంపేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ పేర్కొన్నారు. శనివారం 'ఏక్ పేడ్.. మాకే నామ్' కార్యక్రమంలో భాగంగా పెద్దశంకరంపేటలో ప్రదేశాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మొక్కలను నాటారు. కాగా మండలపరిధిలోని చీలపల్లి, బుజ్రాన్‌పల్లి, గొట్టి ముక్కుల , జూక్కల్, ఆరేపల్లి, మూసాపేట్, బూర్గుపల్లి, లక్ష్మాపూర్, కమలాపూర్, ఆయా గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు నాయకులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు సూర్యప్రకాష్, శ్రావణ్‌కుమార్, మంగలి క్రిష్ణ, బుగుడాల క్రిష్ణ, సుభాష్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పాపన్నపేట: ప్రధాని పిలుపు మేరకు 'ఏక్ పేడ్. మాకే నామ్' పేరిట బీజేపీ నాయకులు, కార్యకర్తలు, శనివారం పలు గ్రామాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వి.బాగేష్, బి.నాగరాజు, చిన్న, దుర్గయ్య రత్నయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

● నిజాంపేట: ప్రధాని మోడీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గేరు గంటి బాబు, ఆముద రాజు పాల్గొన్నారు.

● శివ్వంపేట: మండల పరిధిలోని పెద్ద గొట్టుముక్కల గ్రామంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రఘువీరారెడ్డి హాజరై స్కూల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పెద్దపల్లి రవి, బీజేవైఎం మండల అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

'సాధికారతపై అవగాహన'

సంగారెడ్డి అర్బన్, జూలై 6: సంగారెడ్డిలోని అంబేడ్కర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మహిళలు, బాలికల సాధికారతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికారసంస్థ, జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళ సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల స్పెషల్ అవగాహన కార్యకమానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ హాజరై మాట్లాడారు. మానవ, ఆడపిల్లల హక్కులు, విద్యాప్రాముఖ్యత, కొత్తగా ఏర్పడిన న్యాయ చట్టాలను గురించి వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ రాజారెడ్డి, పట్టణ సీఐ భాస్కర్, డీసీపీవో రత్నం, మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ పల్లవి, కళాశాల ప్రిన్సిపాల్ ధారాసింగ్, రవీంద్రనాథ్, సుమ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా కోర్టుల్లో ఏజీపీల నియామకం

గజ్వేల్, జూలై 6: సిద్దిపేట జిల్లాలోని ఆయా కోర్టులలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను నియమిస్తూ సిద్దిపేట కలెక్టర్ మనూచౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. దుబ్బాక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా సిరికొండ మణి, గజ్వేల్ ఏజీపీగా ఏ.కిరణ్‌సాగర్‌రావు, హుస్నాబాద్ ఏజీపీగా కె.రామకృష్ణలను నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించారు.

పన్నులు చెల్లించి పట్టణ ప్రగతికి సహకరించండి

● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్, జూలై 6: పట్టణ ప్రజలు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో బిల్‌కలెక్టర్‌లు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతు మున్సిపల్ సిబ్బంది పన్నుల వసూళ్లపై దృష్టిపెట్టాలన్నారు. పట్టణ ప్రజలకు మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆయన చెప్పారు.

కేంద్రమంత్రిని కలిసిన ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నర్సాపూర్, జూలై 6: కేంద్ర మంత్రి బండిసంజయ్‌ను కలిసి నర్సాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు కేంద్ర నిధులు వచ్చేలా చూడాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.చిన్నరమేష్‌గౌడ్ తెలిపారు. శనివారం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన బండిసంజయ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలన ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు.

ఘనంగా శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి



హుస్నాబాద్‌లో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్, జూలై 6: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను శనివారం హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు లక్కిరెడ్డి తిరుమల, తోట స్వరూప, నాయకులు తగరం లక్ష్మన్, చిట్టి గోపాల్‌రెడ్డి, కొత్తపల్లి అశోక్, గుత్తికొండ విద్యాసాగర్, తోట సమ్మయ్య, సంతోష్ తదితరులున్నారు. అలాగే కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా మొక్కలు నాటారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 25 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జూలై 6: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సిబ్బందితో వారం రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలో, రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 25 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని శనివారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ చేసి 25 మందికి రూ.14,300 జరిమానా, వారిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.